క్లుప్తంగా

వైభవంగా సీతారాముల ఊరేగింపు



ఊరేగింపులో చిన్నారులు, గ్రామస్తులు

రాజవొమ్మంగి: స్థానిక కోదండరామస్వామి వారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సీతారాముల ఊరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ముగింపు ఉత్సవాల నేపథ్యంలో పిల్లలు, పెద్దలు జై శ్రీరాం అంటూ డప్పు వాయిద్యాల నడుమ కాషాయ జెండాలు చేత పట్టుకొని సందడిగా ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భారీ సమారాధన కార్యక్రమం జరిగింది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

రాజవొమ్మంగి: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ రుణాలకు మొత్తం 187 మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు చెప్పారు. రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకు ద్వారా 20, జడ్డంగి బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా 14 యూనిట్లు మంజూరైనట్టు తెలిపారు. ఆయా బ్యాంకు మేనేజర్లు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి అర్హులను గుర్తించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరు రూరల్: పాడేరు డివిజనల్ పరిధి వివిధ మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతు పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని డివిజనల్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.వి.ఎస్.ఎం. అప్పారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పాడేరు మండలంలో కిండంగి ఫీడర్ పరిధిలోని వంట్లమామిడి, మినుములూరు, మాల్కపోలం, మోదపల్లి, పెదబయలు మండలం రూడకోట ఫీడర్ పరిధిలోని అరడకోట, అడుగులపుట్టు, కమరాడ, లక్ష్మిపేట, గోమంగి, కోయ్యూరు మండలాల్లోని దారకొండ సబ్ స్టేషన్ పరిధిలోని చిన్న అగ్రహారం, పెద అగ్రహారం, జి.మాడుగుల మండలంలో నుర్మతి, భీరం, కిల్లంకోట, సింగర్బ, డుంబ్రిగుడ మండలంలో కురిడి ఫీడర్ పరిధిలోని కొర్రాయి, సొవ్వ, సాగర, గసభ, కొల్లపుట్టు, గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని , వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జీసీసీ గోదాముల్లో తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని జీసీసీ గోదాములు, ఎం.ఎల్.ఎస్.కేంద్రాలను తహసీల్దారు రామకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గోదాముల్లో నిల్వలను తనిఖీ చేశారు. ప్రతినెలా నిత్యావసర సరకులను సకాలంలో డీఆర్ డిపోలకు చేరవేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్కడ అవతవకలకు ఆస్కారం ఇవొద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు.

ప్రైవేటీకరణ తగదు



చింతపల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకుడు చిన్నయ్యపడాల్

చింతపల్లి: విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలను తాము అడ్డుకుంటామని విద్యుత్ కార్మిక సంఘాల గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. ఈనెల 12న విశాఖ వేదికగా నిర్వహించ తలపెట్టిన ఉత్తరాంధ్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆయన బుధవారం చింతపల్లిలో విద్యుత్ కార్మికులతో కలసి ఆవిష్కరించారు. ఉత్తరాంధ్ర సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. సంఘం నాయకులు శేఖర్, ప్రసాద్, సత్యనారాయణ,రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

మోక్షమెన్నడో



కాకరపాడులో నిరుపయోగంగా ఉన్న బాలికల పోస్టు మెట్రిక్ హాస్టల్ భవనం



శిథిలదశకు చేరుకున్న ఆస్పత్రి భవనం

ఆ భవనాలు కోట్ల రూపాయల విలువ చేస్తాయి. అలాంటి భవనాలను ఏళ్ల తరబడి వినియోగించకుండా గాలికి వదిలేశారు. అధికారుల నిర్వహణ కొరవడి భవనాలు శిథిలదశకు చేరాయి. ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారాయి. ఇలాంటి భవనాలు కొయ్యూరు మండల కేంద్రంలో అనేకం ఉన్నాయి. వాటికి చిన్నపాటి మరమ్మతు పనులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

- నిర్వహణపై నిర్లక్ష్యం
- శిథిలదశకు చేరిన భవనాలు
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

కొయ్యూరు: మండలంలోని జీసీసీ నిత్యావసరాల గొడౌన్‌ను 2016లో రూ.24 లక్షలతో నిర్మించారు. చింతపల్లి జీసీపీఎంఎస్ పరిధిలో నిత్యావరాలను నిల్వ ఉంచేందుకు గిడ్డంగిగా వినియోగించారు. తర్వాత దీనిని గ్యాస్ గొడౌన్‌గా ఉపయోగించాలని స్థానికులు భావించారు. దీనిపై స్థానికులు పలుమార్లు అధికారులకు వినతులు ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్యాస్ గోడౌన్ మంజూరు కాలేదు.ఈ భవనం వినియోగంలో లేకపోవడంతో తుప్పలతో నిండిపోయింది. నిర్వహణ కొరవడడంతో లక్షల రూపాయలతో నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలదశకు చేరిందని స్థానికులు చెబుతున్నారు. కొయ్యూరు జీసీసీకి సంబంధించి ఎంఎల్ఎస్ పాయింట్ గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో ఉంది. కొయ్యూరులో ఉన్న ఈ భవనాన్ని బాగుచేసి ఎంఎల్ఎస్ పాయింట్‌గా వినియోగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

కాకరపాడులో కోటి రూపాయల వ్యయంతో పది సంవత్సరాల కిందట బాలికల కోసం పోస్టు మెట్రిక్ హాస్టల్ భవనాన్ని నిర్మించారు. గురుకుల జూనియర్ కళాశాలలో బాలికలకు సైతం సీట్లు కేటాయించే వారు. అయితే రెండేళ్లుగా వాటిని నిలిపివేయడంతో హాస్టల్ భవనం పాడైపోతుంది. ఇప్పుడు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. దీనికి అదనంగా నిర్మించిన వంటశాల భవనం కూడా శిథిలదశకు చేరుకుంది. దీనిని బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.

శిథిలావస్థలో ఆస్పత్రి భవనం

రాజేంద్రపాలెం ఆస్పత్రి భవనాన్ని 40 సంవత్సరాల కిందట నిర్మించారు. అయితే ఆరు సంవత్సరాల కిందట రూ.50 లక్షలతో కొత్త భవనాన్ని నిర్మించి, పాత భవనాన్ని వదిలిపెట్టారు. ప్రస్తుతం ఈ భవనం నిరుపయోగంగా మారి పాడైపోతుంది. పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఈ భవనాన్ని బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని దీనిపై వైద్యశాఖాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న జీసీసీ నిత్యావసరాల గొడౌన్

అధికారులు స్పందించాలి

జీసీసీ కోసం నిర్మించిన భవనం శిథిలదశకు చేరింది. ఇందులో గ్యాస్ గొడౌన్ ఏర్పాటు చేయాలి. ఇక్కడ గొడౌన్ లేకపోవడంతో చింతపల్లి, గూడెం మండలాల నుంచి సిలిండర్లు తీసుకువచ్చి వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– నాని ప్రసాద్, కొయ్యూరు

హాస్టల్ నిర్వాహణకు ప్రతిపాదన



కాకరపాడులో ఏర్పాటు చేసిన బాలికల పోస్టుమెట్రిక్ హాస్టల్ భవనాన్ని వినియోగిస్తాం. కాకరపాడు గురుకుల కళాశాలలో సీట్లు కేటాయించాలని ఐటీడీఏ పీవోకు లేఖ రాశాం. దీంతో పాటు కొయ్యూరులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ప్రకటనలిచ్చాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి హాస్టల్ వినియోగంలోకి వస్తుంది.

– క్రాంతి కుమార్, ఏటీడబ్ల్యూవో, ,కొయ్యూరు

24 నుంచి ముత్యాలమ్మ తల్లి జాతర



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్య ఉత్సవ కమిటీ సభ్యులు

చింతపల్లి: చింతపల్లి ముత్యాలమ్మ తల్లి జాతరకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజుబాలయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకూ చింతపల్లిలో ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించినట్టు చెప్పారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు హేమంత్‌కుమార్, పసుపులేటి వినాయకరావుల ఆధ్వర్యంలో బుధవారం ముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. జాతరను విజయవంతం చేయాలని ఇందుకు అన్ని ఉద్యోగ, వర్తకసంఘాలు, మోటారు, కార్మికసంఘాలన్నీ కలిసిరావాలని కమిటీ సభ్యులు కోరారు.

11న సర్వసభ్య సమావేశం

చింతపల్లి: చింతపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 11న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అనూషాదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని పంచాయతీల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కార్యదర్శులు హాజరుకావాలని ఆయన కోరారు.

మండల పీసా కమిటీ ఎన్నిక

రంపచోడవరం: మారేడుమిల్లి మండలం 12 పంచాయతీల పీసా గ్రామసభ, ఉపాధ్యక్ష, కార్యదర్శులను బుధవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా బి.రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.బాబూరావు, కార్యదర్శిగా కె.కన్నబాబు దొర, సహయకార్యదర్శిగా ఈ.సత్యనారాయణ రెడ్డి, కోశాధికారిగా బి.చిన్నారెడ్డి, ఎన్నికయ్యారు. పలువురు కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా గ్రామసభలు నిర్వహించి తెలియజేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల హక్కులను పరిహరించే యోచన చేస్తోందని అందరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

తునికి పండ్లకు గిరాకీ



తునికి పండ్లు



చింతూరు- రాజమహేంద్రవరం దారిలో తునికి పండ్లను కొనుగోలు చేస్తున్న వాహనచోదకులు

చింతూరు: జిల్లాలో చింతూరు డివిజన్లోని అటవీ ప్రాంతంలో విరివిగా లభ్యమయ్యే తునికి పండ్లకు గిరాకీ ఉంది. సపోటాను పోలి ఉండే ఈ తునికిపండు ఎంతో తియ్యగా ఉంటుంది. సపోటా తొక్క పలుచగా ఉంటే తునికిపండు తొక్కమాత్రం గట్టిగా ఉంటుంది. లోపల గుజ్జు, గింజలు మాత్రం సపోటా పండు మాదిరిగానే ఉంటాయి. అటవీ ప్రాంతంలోని తునికి చెట్లకు కాసే ఈ పండ్లను ఏజన్సీ సపోటాగా పిలుస్తారు. పండ్లు పక్వానికి వచ్చిన తరువాత ప్రతిరోజూ వాటంతట అవే నేలరాలుతాయి. ఆదివాసీలు ఈ పండ్లను సేకరించి మండల కేంద్రాల్లో, ప్రధాన రహదారుల వద్ద పోగు రూ.20కి విక్రయిస్తున్నారు. రోజుకు 50 నుంచి 100 పోగుల వరకు విక్రయాలతో సుమారు వెయ్యి రూపాయల నుంచి రెండు వేల రూపాయల వరకు స్థానిక గిరిజనులు ఆదాయం పొందుతున్నారు. ప్రయాణికులు, వాహనచోదకులు తునికిపండ్లను కొనుగోలు చేస్తున్నారు.

పేద విద్యార్థులకు ఉచిత బోధన



కేంద్రంలో చదువుతున్న చిన్నారులు

వి.ఆర్.పురం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో పేదపిల్లలకు కింగ్‌డమ్ ఆఫ్ హోలీ గ్రాండ్ మినిస్ట్రీస్ సహకారంతో పాస్టర్ కృపారావు ఆధ్వర్యంలో పేద పిల్లలకు ఉచిత బోధన సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. పాస్టర్ కృపారావు మాట్లాడుతూ పేద విద్యార్థులు బాగా చదువుకోవాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటుచేశామని, ఇందులో విద్యార్థులకు ఉచిత బోధనతో పాటు భోజనం, పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి అందజేస్తున్నామన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



రంపచోడవరం ఐటీడీఏ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీ నాయకులు

రంపచోడవరం: ఏజెన్సీలో వన్‌ధన్ వికాస కేంద్రాల ద్వారా జీడిమామిడి పిక్కలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఐటీడీఏ అధికారులు ప్రకటించినా, ఎక్కడ అవీ కనిపించడం లేదని ఆదివాసీ సంఘాల కూటమి (ఏఎస్‌కె) నాయకులు, ఆదివాసీ చైతన్య వేదిక అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ ఎదుట బుధవారం వారు నిరసన తెలిపారు. గ్రామాల్లో ప్రైవేట్ వ్యాపారులు అమాయక గిరిజన రైతుల నుంచి ఇష్టారాజ్యంగా మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవడం లేదన్నారు. వన్‌ధన్ వికాస కేంద్రాలు ఎక్కడా లేకపోవడంతో దళారుల బెడద పెరుగుతుందన్నారు. రైతులను ఆదుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని, దళారీ వ్యవస్థకు మద్దతిస్తున్నట్టు పరిస్థితి ఉందన్నారు. నాయకులు సూకరాజు, ప్రదీప్‌దొర, నారాయణ, రామన్నదొర , రమణ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ నాయకురాలి మృతికి సంతాపం

హుకుంపేట: ఓల్డా పంచాయతీ పోసలగరువులో వైఎస్సార్‌సీపీ నాయకురాలు బాక రంగమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గ్రామాన్ని సందర్శించి, రంగమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అడ్డుమండ సర్పంచ్ గుమ్మ శ్యామ్ సుందర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాంగి సింహాచలం, లక్ష్మయ్య, చిన్నబ్బి తదితరులున్నారు.



ప్రకృతి అందాలకు ఆలవాలయం మన్య ప్రాంతం. చల్లని గాలలు..ఎత్తైన కొండలు..పచ్చని పొలాలు.. జలపాతాల అందాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తాయి. ఇందులో భాగంగా పాడేరు-జి.మాడుగుల రోడ్డులోని జేసీ బంగ్లా ప్రాంతంలో బుధవారం సూర్యోదయం అందం చూపరులను ఆకట్టుకుంది. ప్రకృతి ప్రేమికుల ఈ అందాలను సెల్‌ఫోన్‌లలో బంధించారు. - సాక్షి, పాడేరు

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



సమస్యలపై ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ అక్కమ్మ తదితరులు

గంగవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజాదర్బార్‌ను ఎమ్మెల్యే శిరీష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇందులో భాగంగా గంగవరం, లక్కొండ, దొరమామిడి , ఆముదాలబంద ప్రాంతాల్లో భూపతిపాలెం కెనాల్ ద్వారా సాగునీరు అందడం లేదని, సమస్య పరిష్కరించాలని సర్పంచ్ కలముల అక్కమ్మ, మాజీ ఎంపీటీసీ బుల్లియ్యమ్మ, ఆముదాలబంద ఎంపీటీసీ పండా ఆదినారాయణ దొర , మాజీ సర్పంచ్ కుంజం వెంకటేశ్వర్లుదొర, ఆదివాసీ నాయకులు సిద్ధూ తదితరులు ఎమ్మెల్యేకి వినతిపత్రాలు అందజేశారు. నాయకులు ప్రభ, రాంబాబు, అర్జున, చిన్నారావు, నీలాలమ్మ, సిద్ధూ, రాజు తదితరులు గ్రామాల్లో వివిధ సమస్యలను తెలియజేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో వై.లక్ష్మణరావు, ఉపాధి ఏపీవో ప్రకాశ్, ఏపీఎం షణ్ముఖరావు, ఆర్ఐ లక్ష్మణ్, ఎంఈవో మల్లేశ్వరరావు, ఏఓ విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది



వై.రామవరం సీహెచ్‌సీలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

చింతపల్లి: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యుల వద్దకు వచ్చి అవసరమైన అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రి పర్యవేక్షక వైద్యాధికారి ఇందిరప్రియాంక అన్నారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ పథకం (పీఎంఎస్ఎంఏఎస్)లో భాగంగా బుధవారం ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు అవసరమైన పరీక్షలు నిర్వహించారు. నాటు మందులను ఆశ్రయించవద్దని , చిన్నారులకు పసరు మందులు పెట్టొద్దని సూచించారు. ఇళ్ల వద్ద ప్రసవాలను మానుకోవాలని కాన్పుల కోసం వారంరోజుల ముందుగానే ఆస్పత్రికి రావాలని ఆమె సూచించారు.

వై.రామవరం: పీఎంఎస్ఎంఏఎస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం 75 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, రక్తపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వారిలో 17 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో చేర్పించుకున్నారు. వారికి ప్రత్యేక వైద్యసేవలతోపాటు, అవసరమైన మందులు అందించారు. శిబిరానికి హాజరైన గర్భిణులకు భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. గైనకాలజిస్టు డాక్టర్ రాకేష్, సీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు.

ఎటపాక: తల్లీ, బిడ్డల ఆరోగ్యం కోసమే ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ పథకం ఉపయోగపడుతుందని నెల్లిపాక పీహెచ్‌పీ డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 40 మంది గర్భిణులకు బరువు, బీపీ, గర్భస్థ పరీక్ష, రక్త పరీక్షలు చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య భద్రత విషయాలను వివరించారు. డాక్టర్ విష్ణుప్రియ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రసూతి సంరక్షణ సేవలు అందిస్తామన్నారు. ఆస్పత్రిలో ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణీలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దోమలమందు పిచికారీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి తులసి

చింతూరు: మలేరియా నివారణకు అన్ని గ్రామాల్లో దోమలమందు తప్పనిసరిగా పిచికారీ చేయాలని జిల్లా మలేరియా అధికారి తులసి అన్నారు. మలేరియా నివారణ, దోమలమందు పిచికారీ అంశాలపై స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇతర శాఖల సిబ్బంది సహకారంతో పూర్తిస్థాయిలో గ్రామాల్లో దోమలమందు పిచికారీ జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామస్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేసి లార్వా పెరుగుదల ప్రాంతాలను గుర్తించి పిచికారీ కార్యక్రమం విస్తృతంగా చేపట్టాలన్నారు. దీనిపై స్వయం సహాయక సంఘాల సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు దోమలు కుట్టకుండా ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో దోమతెరలు ఏర్పాటుచేసి తగు జాగ్రత్తలు ఆమె సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, డీఎల్‌పీవో నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వ్యాన్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న కోళ్ల వ్యర్థాల వ్యాన్, అదుపులో తీసుకున్న డ్రైవర్

అడ్డతీగల: కోళ్ల వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్న వ్యాన్‌ని బుధవారం పట్టుకున్నట్టు ఎస్ఐ వినోద్ తెలిపారు. కోళ్ల వ్యర్థాలు రవాణా జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు అడ్డతీగలలోని అటవీశాఖ తనిఖీ కేంద్రం వద్ద వాహనాల తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఎపి39 టిఎం 0860 నెంబర్ గల వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా. ప్లాస్టిక్ డబ్బాల్లో కోళ్ల వ్యర్థాలను గుర్తించామన్నారు. వీటిని కొత్తపల్లి, గోకవరం, గంగవరం ప్రాంతాల నుంచి చేపల చెరువులకు తరలిస్తున్నట్టు తెలిసిందన్నారు. ప్రజారోగ్యానికి భంగం కలిగించడంతో పాటు పర్యావరణానికి హానికరమైన వ్యర్థాలను అక్రమంగా రవాణా చేయడం నేరమన్నారు. కోళ్ల వ్యర్థాలు, వ్యాన్‌ని డ్రైవర్ గొల్లపల్లి వెంకటరెడ్డిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వాణిజ్య పంటల సాగుపై అవగాహన



లక్కవరపేటలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి మధుసూదనరావు

గూడెంకొత్తవీధి: గిరిజనులు గంజాయి సాగు వీడి, ప్రత్యామ్నాయంగా అధిక లాభాలనిచ్చే పలు రకాల పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు అన్నారు. మండలంలోని లక్కవరపేట, ఎర్రచెరువులు గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన రైతులకు వాణిజ్య పంటలసాగుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులంతా తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

జీసీసీలో అక్రమాలపై విచారణ జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లపు వెంకట్

చింతూరు: స్థానిక జీసీసీలో జరిగిన అక్రమాలపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలని సీపీఎం నాయకులు డిమాండ్‌చేశారు. బుధవారం చింతూరులో జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పల్లపు వెంకట్ మాట్లాడుతూ ప్రజలకు అందాల్సిన రేషన్ సరకుల పంపిణీలో సంబంధిత అధికారులు రూ.25 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని, రాష్ట్ర విభజన అనంతరం ఇక్కడి జీసీసీ కేంద్రం అధికారులకు లాభాలు చేకూరుస్తోందని ఆయన ఆరోపించారు. కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఉన్నతాధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇతర ప్రాంతాల్లో అవినీతికి పాల్పడిన అధికారులను తిరిగి ఇక్కడ నియమిస్తుండడంతో వారు మరింత చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇక్కడ పనిచేసిన అధికారుల ఆస్తులపై సమగ్ర విచారణ చేపట్టి దోషులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొడియం లక్ష్మణ్, సుబ్బారావు, మనోజ్, శేఖర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.